క్లుప్తంగా

గ్రామస్తులతో పోలీసుల ముఖాముఖి


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

ఉదయగిరి: మండలంలోని దుర్గంపల్లిలో గ్రామస్తులతో సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు వారంలో రెండ్రోజులపాటు సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చొరవ చూపుతామని, గ్రామాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులకు తినుబండారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కనిపించడం లేదంటూ ఫిర్యాదు


పెంచలప్రసాద్

ఆత్మకూరు: పట్టణంలో ఇంటర్మీడియట్ చదువుతున్న తన కుమారుడు కళాశాలకు వెళ్లి రెండు రోజులైనా తిరిగిరాలేదని ఆ విద్యార్థి తల్లి మంజుల ఆత్మకూరు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వాశిలి గ్రామానికి చెందిన పోలా మంజులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కోలా పెంచలప్రసాద్ (16) ఆత్మకూరులో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం కళాశాలకు వెళ్లిన పెంచలప్రసాద్ తరగతుల అనంతరం కళాశాల నుంచి వెలుపలకి వచ్చి కనిపించలేదని, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెదికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మంజుల తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పెంచలప్రసాద్ ఆచూకీ తెలిసిన వారు 80197 82215 ఫోన్‌నంబర్‌కు సమాచారం అందించాలని తల్లి మంజుల కోరారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు


పొలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ డీడీఏ శివన్నారాయణ

వరికుంటపాడు: వర్షాధార పంటల సాగులో సేంద్రియ ఎరువుల వినియోగంతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని ఆత్మ డీడీఏ జి.శివన్నారాయణ పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని విరువూరు గ్రామంలో శనగపంట సాగు చేసే రైతులకు హైడ్రోజల్, ట్రైకోడెర్మావిరిడి వినియోగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఎకరాకు 2 కేజీల హైడ్రోజల్‌ను 1:10 నిష్పత్తిలో సన్నని ఇసుకతో కలిపి పొలంలోని విత్తనపు సాళ్లలో వేయాలన్నారు. అలాగే ఎకరం పొలానికి 2 కేజీల ట్రైకోడెర్మావిరిడీ జీవ రసాయనాన్ని 100 కేజీల మాగిన పశువుల ఎరువులో కలిపి చివరి దుక్కిలో పొలంలో వేసుకున్నట్లయితే శనగలో ప్రధాన సమస్య అయిన ఎండుతెగులు నుంచి పంటను రక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు శారద, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట.. భూసారం పెంపులో దిట్ట

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తుల దిగుబడి పెంచాలంటే ఉన్న భూమినే సారవంతం చేసుకొని అనువైన పంటలను పండించుకోవాలని ఓ వైపు ప్రభుత్వాలు, అధికారులు చెబుతున్నారు. భూసారం పెరగాలంటే కేవలం పచ్చిరొట్ట పైర్లతోనే సాధ్యమన్న విషయం ఇప్పటికే శాస్త్రీయంగా నిరూపితమైంది. సుమారు 60 శాతం రైతులు పచ్చిరొట్ట పైర్ల సాగుకు ముందుకొస్తున్నా ఇంకా 40 శాతానికి పైగా అన్నదాతలు భూసారం పెంచేందుకు తమవంతు బాధ్యత వహించాల్సి ఉంది.

రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ

- సాగు ఖర్చులూ తగ్గుతాయి
- అన్నదాతలకు అండగా ప్రభుత్వం

ఆత్మకూరు: అనాదిగా రైతులు ఏడాదికి ఒక్క పైరు మాత్రమే సాగు చేస్తూ గత పంట కోతల అనంతరం భూములను ఖాళీగా ఉంచకుండా పిల్లిపెసర, పెసర, నీలి ఆకు లాంటి పచ్చిరొట్ట విత్తనాలను చల్లడం జరుగుతుండేవి. పెసర, పిల్లి పెసర పైర్లతో రైతుల పశువులకు మేత లభించడంతోపాటు వాటిని భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరిగే అవకాశం ఉండడంతో సాగు చేసేవారు. కాలక్రమంలో రైతులు ఏడాదికి 2 లేదా 3 పంటలు పండించే పరిస్థితి ఏర్పడింది. గతంలో కన్నా తక్కువ కాల పరిమితిలో ధాన్యం చేతికొచ్చే వరి వంగడాలను ప్రభుత్వం విరివిగా ఉత్పత్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవడంతో పరిస్థితులు మారాయి. అదే క్రమంలో భూసారం ఏటికేడాది తగ్గుతుండడంతో రైతులు కేవలం రసాయన ఎరువుల వినియోగం పెంచి వ్యవసాయం చేస్తుండడంతో భూసారంతోపాటు దిగుబడులూ తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తల సలహాలతో ప్రభుత్వాలు పచ్చిరొట్ట పైర్ల సాగుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, తప్పనిసరిగా వాటిని సాగు చేయాలని విస్తృత ప్రచారం కల్పిస్తోంది. దీంతో రైతులు పచ్చిరొట్ట పైర్ల సాగుపై ఆసక్తి చూపుతున్నారు.


ఏపుగా పెరిగిన జనుము పైరు

సాగు ఖర్చు ఆదా

పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి భూమిలో కలియదున్నితే తదుపరి సాగు చేసే పైర్లకు నత్రజని అంది 50 శాతానికి పైగా సాగు ఖర్చు తగ్గనుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పచ్చిరొట్ట పైర్ల ద్వారా పొలాల్లో సేంద్రియ కర్బనం పెరుగుతుంది. దీని ద్వారా మట్టి రేణువుల్లో నీటిని అంటిపెట్టుకొనే గుణం పెరుగుతుందని శాస్త్రీయంగా నిరూపితమైనట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా భూ ఆరోగ్యం పెరగాలంటే పచ్చిరొట్ట పైర్లతోనే సాధ్యమని ఈ దిశగా రైతులు ఆలోచన చేయాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అన్నదాతలకు ఆర్‌బీకేల ద్వారా జనుములు, జీలగలు, పిల్లిపెసర విత్తనాలు పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.


సాగులో ఉన్న పిల్లిపెసర

చల్లకం ఇలా..

+ జీలగలు: వరి పైరు సాగు అనంతరం ఎకరాకు 10 నుంచి 12 కిలోల జీలగ విత్తనాలను ఇసుకలో కలిపి పొలంలో చల్లితే 8 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు రైతులకు అందనుంది.
+ జనుములు: జనుము పైరు పశువులకు మేత గానూ, పొలానికి ఎరువు గానూ ఉపయోగపడుతుండడంతో రైతులు అధికంగా జనుము విత్తనాలు ఎకరాకు 12 కిలోల చొప్పున చల్లడం ఆనవాయితీ.
+ పెల్లిపెసర: గ్రామీణ ప్రాంతాల్లో అనాదిగా ఏటా తొలి పంట అనంతరం పిల్లిపెసర విత్తనాలు చల్లడం ఆనవాయితీ. అటు పశువులకు మంచి మేత గానూ, పొలాలకు అధిక నత్రజని అందజేసే ఎరువు గానూ ఉపయోగపడే పిల్లిపెసర సాగుపై రైతులు అధిక ఆసక్తి చూపుతారు.

ఇటీవల రైతులకు అందజేసిన పచ్చిరొట్ట విత్తనాలు (క్వింటాళ్లలో)

మండలం	జీలగలు	జనుములు	పిల్లిపెసర
ఆత్మకూరు	199.7	39.2	88.8
సంగం	127	12	37
ఏఎస్‌పేట	130	31	40
చేజర్ల	180	30	44
అనంతసాగరం	142	75	-
మర్రిపాడు	84	62	43

ఆర్‌బీకేల ద్వారా విత్తనాల సరఫరా

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో పచ్చిరొట్ట పైర్లు అయిన పిల్లిపెసర, జనుము, జీలగ విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందిస్తోంది. గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల ద్వారా ఇప్పటికే వందలాది క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందజేయడంతో పలువురు రైతులు ఆ విత్తనాలు చల్లి పైర్లను ఏపుగా పెంచారు. వరి నాట్ల సమయానికి ఈ పైర్లు ఏపుగా పెరిగి భూమిలో కలియదున్నితే భూసారం తప్పనిసరిగా పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

తక్కువ ధరకే విత్తనాలు



రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ధరకే పిల్లిపెసర, జీలగ విత్తనాలు అందజేస్తుండడంతో వరి కోతలు కాగానే పొలంలో విత్తనాలు చల్లాను. ప్రస్తుతం మా పొలంలో వరి నారు పోశాను. నాట్లకు ముందు జీలగ, పిల్లిపెసరను పొలంలో దున్నేస్తాం. తద్వారా పశువుల ఎరువు కన్నా అధికంగా భూసారం పెరుగుతుంది.

– కాకి తిరుపాలు, రైతు, దేవరాయపల్లె

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ



పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడం రైతులకు అనాదిగా వస్తున్న సంప్రదాయమే. సంకర జాతి వరి వంగడాలతో ఏడాదికి 2 లేదా 3 పంటలు వేస్తుండడంతో భూసారం తగ్గిపోయింది. దీంతో రైతులకు పచ్చిరొట్ట పైర్లపై అవగాహన కల్పిస్తూ సబ్సిడీపై ప్రభుత్వం రొట్టపైర్ల విత్తనాలు సరఫరా చేస్తోంది. తద్వారా పంటల సాగు ఖర్చు తగ్గి రైతులు అధిక దిగుబడులు సాధించగలుగుతారు.

– వి.శశిధర్, వ్యవసాయశాఖ అధికారి, చేజర్ల

రాజారెడ్డిని కలిసిన నేతలు


మేకపాటి రాజారెడ్డితో సీతారామపురం నాయకులు

సీతారామపురం: వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డిని సీతారామపురం నాయకులు గురువారం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ మండలంలో నాయకులంతా సమష్టిగా పనిచేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చెరుకుపల్లి రమణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బసిరెడ్డి కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బాలినేని మాబయ్య, ఎస్ఎఫ్‌డీ సంస్థ చైర్మన్ కలివెల ఎలీషాకుమార్, సర్పంచ్ దుర్గాప్రసాద్, నాయకులు పాణెం రమణయ్య, గోరంట్ల తిరుపాలు, గుర్రం సుబ్బయ్య, ప్రసాదు, ఓబులేసు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి



అనుమసముద్రంపేట: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏఎస్‌పేట ఎస్సై నజీర్ కోరారు. గురువారం ఏఎస్‌పేటలోని జెడ్పీ హైస్కూల్‌లో క్రేడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎస్సై నజీర్ బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు అన్నివిధాలుగా అండగా నిలుస్తూ సంక్షేమ పాలన అందిస్తోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణంలోని 6వ వార్డులో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుకు ఏనాడూ పేదలు గుర్తురాలేదని, అలాంటిది ఇప్పుడు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ అంటే నమ్మేదెవరు? అని అన్నారు. హామీలిచ్చి ఎగ్గొట్టే నైజం చంద్రబాబుది అని ఎమ్మెల్యే మండిపడ్డారు. గత నాలుగున్నరేళ్లలో జగనన్న పాలనలో జరిగిన మేలును ప్రజలు ఒక్కసారి గుర్తుచేసుకోవాలని, గతంలో చంద్రబాబు ఎలా మోసం చేశారో ఆలోచించాలని సూచించారు.

పేదల సంక్షేమం కోసమే

జగనన్న ప్రభుత్వం విద్యార్థుల కోసం అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, రైతుల కోసం వైఎస్సార్ రైతుభరోసా, సున్నావడ్డీ రుణాలు, ఉచిత పంటల బీమా, ఇతర వర్గాలకు వైఎస్సార్ పింఛన్ కానుక, చేయూత, ఆసరా, నేతన్న నేస్తం, జగనన్న చేదోడు, ఆరోగ్యశ్రీ, కల్యాణమస్తు, షాదీతోఫా, జగనన్న తోడు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. చంద్రబాబు పేదవర్గాలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నారని గుర్తుచేశారు. అన్నివర్గాలకు ఎంతో మేలు చేసిన జగనన్నను మళ్లీ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, ఏడుంబాకం వెంకయ్య, జనిగర్ల మహేంద్రయాదవ్, కుందుర్తి కామయ్య, పొనుగోటి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయండి

వరికుంటపాడు: మండలంలోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి గర్భిణుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని మండల వైద్యాధికారిణి ఆయేషా సూచించారు. ఆమె గురువారం స్థానిక సీహెచ్‌సీలో సిబ్బందితో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయేషా మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలన్నారు. అర్హులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులు కాన్పులు చేయించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు, సూపర్‌వైజర్ వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమికి అరుణాచలానికి అదనపు బస్సులు

కావలి: కావలి పట్టణ ప్రజలు, భక్తుల కోరిక మేరకు కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణకు అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్‌ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమికి ఏర్పాటు చేసే బస్సులో సీట్లు రిజర్వేషన్ పూర్తయినందున, కార్తీక పౌర్ణమి రద్దీ దృష్ట్యా ఈ బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, సీట్లు ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలని తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట


ప్రతిష్టించిన అయ్యప్పస్వామి విగ్రహం


18 మెట్లపై కర్పూరజ్యోతులు వెలిగిస్తున్న భక్తులు

సంగం: స్థానిక కామాక్షీదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వేదపండితులు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, వేణుగోపాలస్వామి, మాలికాపురత్తమ్మ విగ్రహాలను ప్రతిష్టించారు. అయ్యప్ప మాలధారులు స్వామియే శరణమయ్యప్ప నామస్మరణలతో శ్రీధర్మశాస్త్ర శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించి స్వామి వారి 18 మెట్లపై భక్తిశ్రద్ధలతో కర్పూరజ్యోతులు వెలిగించారు. అనంతరం కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్పస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పేదింటి ఆడపడుచులకు అండగా జగనన్న

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా మంజూరుపై హర్షం


ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: పేదింటి ఆడపిల్లలకు వారి తల్లిదండ్రులు గౌరవప్రదంగా పెళ్లి జరిపించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫాను అందజేసి అండగా నిలుస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా నాలుగో విడత మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్సార్ కల్యాణమస్తు, మైనార్టీల ఆడపిల్లలకు వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందని తెలిపారు. జూలై నుంచి సెప్టెంబర్ లోపు వివాహం చేసుకున్న వారికి ఈ నగదు అందనుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 52 జంటలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అనంతసాగరం మండలంలో 10 జంటలకు, ఏఎస్‌పేటలో 10, ఆత్మకూరులో 11, మున్సిపాలిటీలో 2, చేజర్లలో 34, మర్రిపాడులో 9, సంగం మండలంలో 6 జంటలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకం ద్వారా నగదు అందనుందని తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ ఆర్థికసాయాన్ని రెట్టింపు చేసి అందిస్తోందని తెలిపారు.

జగనన్నతోనే ప్రగతి సాధ్యం


సోమశిల: సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


చేజర్ల: సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం


సంగం: సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

చేజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రగతి, పేదల సంక్షేమం సాధ్యమని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని వావిలేరు సచివాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అధికారులు, నాయకులు సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులమతాలు, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలను అందిస్తోందని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, ఏపీఎం చీర్ల సుజన, సర్పంచ్‌లు గోనుగుంట రాంబాబు, ఎ.వెంకటేశ్వర్లు, నాయకుడు వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి సురేష్, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సోమశిలలో..

సోమశిల: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని అనంతసాగరం మండలం సోమశిలలో గురువారం నిర్వహించారు. తొలుత సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సచివాలయాల మండల కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు బత్రెడ్డి పోలిరెడ్డి, ముక్కు మస్తాన్‌గౌడ్, గుండుబోయిన సరస్వతి, నాయకులు పెద్ద పుల్లయ్య, ఈశ్వరయ్య, వెంకటరమణ, కృష్ణయ్య, సుబ్బరాయుడు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చిన్నమాచనూరులో..

మర్రిపాడు: మండలంలోని చిన్నమాచనూరు సచివాలయం పరిధిలో గురువారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులను అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరిమి నాగలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, సర్పంచ్ కటకం నరసింహారావు, చెవుల శ్రీనివాసులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


ఉదయగిరి: చాకలికొండ సెంటర్‌లో..

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

సంగం: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీటీసీ సభ్యురాలు పెంచలమ్మ అన్నారు. గురువారం మండలంలోని తరుణవాయి సచివాలయ పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లతో ఉన్న డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రమేష్, హౌసింగ్ ఏఈ కరిముల్లా, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

చాకలికొండలో ..

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని చాకలికొండ సచివాలయం వద్ద గురువారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ డైరెక్టర్ పోలుబోయిన వెంకటేశ్వర్లు, జేసీఎస్ మండల కన్వీనర్‌తోపాటు ఎంపీడీఓ రాజేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి


ఉపాధి హామీ పనులపై ప్రశ్నిస్తున్న బోడవారిపల్లి సర్పంచ్ కొండారెడ్డి

దుత్తలూరు: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై పలుచోట్ల ఫిర్యాదులు అందుతున్నాయని, ఇకపై ఫిర్యాదులు రాకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు నివేదికలు సమర్పించారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల గురించి తమ ప్రమేయం లేకుండానే పనులు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే విద్యుత్ సమస్యలపై సభ దృష్టికి తెచ్చారు. రైతులకు సకాలంలో విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధిలో బినామీ మస్టర్లు వేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇకపై అలా జరిగితే సహించబోమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీఓ సాయిప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జయంతి


సత్యసాయి, సాయిబాబా చిత్రపటాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతిని ఆత్మకూరు పట్టణంలో సత్యసాయిబాబా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆత్మకూరు చెరువు వద్ద ఉన్న సాయిబాబా ట్రస్ట్ కార్యాలయంలో సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం సత్యసాయి బాబా భజనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జగర్లపూడి నాగరాజశర్మ తదితరులు పాల్గొన్నారు.